# మరమనిషి

ఈమధ్య మీరందరూ అభిమానించే ఒక రచయిత్రితో మాట్లాడుతుంటే ఒక విషయం మా మాటల్లో వచ్చింది. అదీకాక ఇక్కడ మా మిత్రుడొకడు - సరదాగా మిత్రా అందాం, అమెరికాలో ఎవరికీ లెఖ్ఖలు రావనే ఒక వాదం మొదలు పెట్టాడు. అతనికి జవాబుగా కూడా వుంటుందని ఈ వ్యాసం వ్రాద్దామనిపించింది.

ముందుగా మిత్రా సంగతి చూద్దాం ఈమధ్యనే ఇండియానించీ అమెరికాకి వలస వచ్చాడేమో, అలా వచ్చిన చాలమంది మనవాళ్ళలాగానే వెస్ట్‌లో బెస్ట్ బాగా అనుభవిస్తున్నా, అతనికింకా ఈస్ట్ బెస్ట్, వెస్ట్ వేస్ట్ లానే వుంది. అతనికి అమెరికాలో జరుగుతున్న అన్నిటినీ ఆలస్యం చేయకుండా తిట్టేయటం హాబీలా మారిపోయింది. అతను అంటాడూ...

'అమెరికాలో ఎవరికీ లెఖ్ఖలు చేయటం రాదు. ఉదాహరణకి మొన్న నేను ఒక షాపుకి వెళ్ళాను. నేను కొన్నది మూడు ఐటమ్స్. ఒకటి 3.99, ఇంకోటి 5.99 మూడోది 1.99. అంటే మొత్తం ఎంత? 11.97. ఎనిమిది శాతం టాక్స్‌తో కలిపి 12.93. ఆ అమ్మాయి ఒక్కొక్కటీ కంప్యూటర్‌లో టైప్ చేసే లోపలే నేను ఎంతో చెప్పేశాను. ఆ అమ్మాయికి అదీ తెలీదు' అన్నాడు.

మిత్రా స్వతహాగా తెలివైన వాడు కూడాను. అతను చకచకా అలా లెఖ్ఖలు కట్టేయటం బాగానే వుంది. ఇండియాలో మా అమ్మ, కూరగాయల లెఖ్ఖలూ, పాల లెఖ్ఖలూ ఎప్పుడూ కాగితం కలం వాడకుండా నోటితో చేసేది. కానీ ఇక్కడ పరిస్థితి వేరు. ఆ అమ్మాయి అలా కంప్యూటర్‌లో అలా చేస్తేనే అక్కడ రికార్డ్ అవుతుంది. రిసీట్ వస్తుంది. కంప్యూటర్‌లో తర్వాత ఎకౌంట్స్ చేసుకోవటానికి అదే ఆధారం. అదీకాక ఆ అమ్మాయి ప్రొద్దుటినించీ సాయంత్రం దాకా, అంటే రోజుకి ఎనిమిది గంటలు అదే పని. నోటి లెఖ్ఖలు చేస్తూ కూర్చుంటే, కస్టమర్లకి ఆలస్యం అవటమే కాకుండా, డబ్బుల్లో ఏమైనా హెచ్చుతగ్గులు వస్తే ఆమె జీతంలో తెగగోస్తారు. ఇవన్నీ మిత్రాకి అనవసరం.

అలాగే ఇంకోసారి అన్నాడు, 'అమెరికాలో ఎవరికీ వ్రాయటం రాదు. అన్నీ కంప్యూటర్ మీదే చక్కటి హేండ్ రైటింగ్ ఎలా వస్తుంది?' అని.

నవ్వి వూరుకున్నాను, అతని రాత నాకు తెలుసు కనుక.

ఈమధ్యనే ఇంకో బాంబ్ పేల్చాడు. 'ఇంటర్నెట్ వచ్చాక జనంలో బద్ధకం పెరిగిపోయింది. లైబ్రరీకి వెళ్ళి పుస్తకాలు చదవకుండా, ఎన్సయిక్లోపీడియా కూడా వెబ్‌లోనే చూస్తున్నారు.. ' అన్నాడు.

నవ్వుతూనే అన్నాను, 'అవును మరి. అదే ఎంతో వెసులుబాటుగా వుంటుంది కదూ. నేను వ్రాసేటప్పుడు కావలసిన సమాచారం అంతా ఇన్‌ఫర్మేషన్ హైవే మీదే కదా నాకు దొరికేది కూడాను' అన్నాను.

'ఏమో మనిషి మరమనిషి అయిపోతున్నాడు' అన్నాడు మిత్రా.

ఇదేమాట నలభై ఏళ్ళ క్రితం, నేను కాకినాడ ఇంజనీరింగ్ కాలేజీలో చదివేటప్పుడు విన్నాను. అక్కడి ఒక ప్రొఫెసర్‌గారు అనేవాడు 'మనిషి ఎంతో శ్రమించి ఎన్నో మరలను (మెషీన్స్) తయారుచేస్తున్నాడు. కానీ గమ్మత్తేమిటంటే తను తయారుచేసిన ఆ మరలకి తనే బానిస అయిపోతున్నాడు' అని.

ఆయన చెప్పిన ఉదాహరణ ఎలక్ట్రిసిటీ. 'ఒక అరగంట కరెంట్ పోతే మన జీవితాలే ఆగిపోతాయి కదా. ఏమీ చేయలేం' అనేవాడు. ఆయన మాటలు వినే కాబోలు మన శ్రీ ప్రభుత్వం వారు, ప్రతిరోజూ కరెంట్ పీకేసి, దాని మీద మనం ఆధారపడే అలవాటు రాకుండా జాగ్రత్త పడుతున్నట్టున్నారు.

ఇదేదో సరదాగా చెప్పుకున్నా ఆయన చెప్పిన మాటల్లో నిజం లేకపోలేదు. మొన్న మా ఆఫీసులో ట్రాన్స్‌ఫార్మర్ మారుస్తున్నారని, ఒక మధ్యాహ్నం అందరినీ ఇంటికి వెళ్ళమన్నారు. మామూలుగా ఏ శనాదివారాల్లోనో చేస్తారా పని. కానీ ఏదో అత్యవసరమైన పరిస్థితి వచ్చింది. తప్పదు. అంతమంది ఒక పూట పని చేయకుండా ఇంటికి వెడితే కంపెనీకి ఎంతో నష్టం మరి. డిజైన్ ఇంజనీర్లు కంప్యూటర్ లేకుండా ఏమీ చేయలేరు. అలాగే కంప్యూటర్ లేకపోతే ఎక్కడ పెట్టిన మెటీరియల్స్ అక్కడే గొంగళిలా కదలకుండా పడివుంటాయి. ఫోన్లు పనిచేయకపోతే, జీవితమే స్థంభించి పోదూ! మరి లిఫ్ట్ మాటేమిటి? మూడో అంతస్థు దాకా ఫరవాలేదు. పధ్నాలుగు అంతస్థులున్న బిల్డింగ్‌లో, ఎంత ఎక్సర్‌సైజ్ కావాలనుకునే వాళ్ళకైనా కష్టమే మరి. ఓ మర్చిపోయాను. ఎయిర్ కండిషన్ లేకుండా డబ్బున్న మానవమాత్రులు మరి బ్రతకగలరా? మా చిన్న వూళ్ళల్లోనే ఇంత అయితే, న్యూయార్క్ చికాగోలాటి పెద్ద నగరాల్లో ఒక్క గంట కరెంట్ పోతే భూభ్రమణమే ఆగిపోయినంత మరి!

మనమింతవరకూ ఒక్క కరెంట్ పోతే ఏమవుతుంది అనే విషయం మీదే ఉదాహరణలు ఇచ్చుకున్నాం. అలాటివి చాల వున్నాయి. రైళ్ళూ బస్సులూ వాషర్లూ డ్రయ్యర్లూ ఫ్రిడ్జ్‌లూ... ఇలాటివన్నీ ఈనాడు మన జీవితాల్లో కలిసిపోయాయి. వాటిల్లో ఏవి పనిచేయకపోయినా కష్టమే. నేను కొన్నేళ్ళ క్రితం నా అమెరికా బేతాళుడి కథల్లో వ్రాశాను. అమెరికాలో కాళ్ళు లేకపోయిన ఫరవాలేదు కానీ, కార్లు లేకపోతే బ్రతకటం కష్టం అని. అదేదో సరదాగా ప్రాస కోసం వ్రాసిందికాదు. అక్షరాలా నిజం.

'ఏమో నేను మాత్రం సెల్ ఫోన్ లేకుండా ఒక్క క్షణం కూడా బ్రతక లేను. అది లేకపోతే అమ్మో.. ' అంది గాయ్, కళ్ళు గుండ్రంగా తిప్పుతూ. ఆకాశం వూడి ఆమె తల మీద పడ్డట్టుగా వుంది ఆమె ముఖం.

'ఏమోనమ్మా. మా రోజుల్లో ఇవేవీ లేవు. చెట్టు క్రింద కూర్చుని పిండి రుబ్బుకునేవాళ్ళం, పంపు దగ్గర బట్టలు వుతుక్కునేవాళ్ళం. ఫోన్‌తో పనేముంది అసలు. మా సీతారావుడు నాతో ఎప్పుడు మాట్లడాలంటే అప్పుడు స్వయంగా వచ్చి, ఆ నులక మంచం మీదే కూర్చుని గంటల తరబడి మాట్లాడేవాడు' అంది గాయత్రమ్మ, అంటే గాయ్‌కి బామ్మగారు. ఆవిడ పుట్టి తొంభై ఏళ్ళయిందేమో, పళ్ళు వూడిపోవటం వల్ల, బోసి నోరు ఆవిడకి ఎంతో హుందాగా వుంది. గాయ్‌కి

బొమ్మ పేరే పెట్టుకున్నారు.

మరి మా కాకినాడ గురువుగారు అన్నట్టుగా తను కనిపెట్టిన యంత్రాలకే మనిషి ఎందుకు బానిసయిపోతున్నాడు? అదెందుకో మనం చర్చించే ముందు, నాకు కవికోకిల జాషువాగారు గుర్తుకి వస్తున్నారు. తను వ్రాసిన పాపాయి పద్యాలలో ఆయన వ్రాసిన కొన్ని మాటలు గుర్తుకి వస్తున్నాయి.

బిడ్డల సృష్టికి కారణమైన తల్లిదండ్రులు బిడ్డ పుట్టగానే తమ పెత్తనం మానేసి ఆ కొత్త పెత్తందారు చెప్పిన మాట వింటారుట. వారి జీవిత విధానంలో వచ్చే మార్పులన్నీ ఆ కొత్తపెత్తందారు వల్లే. అంటే ఒక విధంగా ఈరోజుల భాషలో చెప్పాలంటే ఆ భార్యాభర్తల హనీమూన్ అక్కడితో ఆగిపోయి, ఇక ఆ పసిపాప ఆడించినట్టు ఆడుతుందని. అందుకే నాకు ఈ రెండిటికీ చక్కటి పోలిక కనపడుతుంది.

అవునయ్యా! మరి నువ్వవన్నీ కనిపెట్టావు. బాగానే వుంది. ఏదో అవసర మైనప్పుడు వాడుకుంటే అదీ బాగానే వుంటుంది. కానీ అలా మరమనిషిలా మారి పోవాలా? అవి లేకుండా పుట్టిన వాడివి అవి లేకుండా బ్రతకలేవా? అనేది కొందరి ప్రశ్న. అక్కడే దాల్లో లెగ్గేశారంటాను.

ఇప్పుడీ యంత్రాల, మరల సహాయం లేకుండా ఎవరూ పుట్టటం లేదు. హాస్పిటల్లో స్కాన్ దగ్గర నించీ, సిజేరియన్ దాకా మనిషి కనిపెట్టినవే. అంతేకాదు మన చుట్టూ వున్నవన్నీ మనిషి కనిపెట్టినవే. అవి తన సుఖాలకోసం కనిపెట్టుకున్నవే. మరి అలాటప్పుడు ఆ సుఖాలకోసం వాటికి బానిస అయిపోవటంలో ఆశ్చర్యం ఏముంది? నడిచి వెళ్ళే మనిషి కుదుపుల ఎద్దు బండి ఎక్కాడు. కారులో సుఖంగా కూర్చుని వెడుతున్నాడు. రైల్లో ఇంకా సుఖంగా పడుకుని వెడుతున్నాడు. ఇంకా వేగంగా వెళ్ళాలనుకున్నప్పుడు ఆకాశంలో పక్షిలా ఎగిరి త్వరితంగా వెడుతున్నాడు. సముద్రాలు లంఘించి వెడుతున్నాడు.

బట్టలు వుతికి, ఆరవేసే యంత్రాలతో తన పని సులభం చేసుకుంటున్నాడు. అమెరికానించీ ఆత్రేయపురం అలవోకగా పిలిచేస్తున్నాడు. అమ్మని వెబ్ కేమెరాలో చూసేస్తున్నాడు. అమెరికాలో రెండు మూడుసార్లు కంప్యూటర్ మౌస్ క్లిక్ చేసి ఇండియాలో మర్నాడే అత్తగారికి స్వీట్లు పంపిస్తున్నాడు. డ్రైవ్ చేసుకుంటూ పొరుగూరు వెళ్ళిన టీనేజ్ కూతురు అరగంటకోసారి సెల్ ఫోన్‌లో పిలిచి అంతా బాగానే వుంది అని చెబుతుంటే ధైర్యంగా వుంటున్నాడు. సుఖాల మరుగున తను కనిపెట్టిన యంత్రాలకి కావాలనే బానిస అయిన ఆ మనిషి, కావాలనే మరమనిషి అయాడు.

అంతేకాదు. ఆ మరల సహాయంతో పుట్టిన మనిషి పోయేటప్పుడు కూడా తను కనిపెట్టిన ఎలెక్ట్రిక్ క్రిమటోరియంలో పడుకుని బూడిద అయిపోతున్నాడు.

అలా తను కనిపెట్టినయంత్రాల ద్వారానే, వాటి నించి విముక్తి పొందుతున్నాడేమో!

0 0 0